ఉపాధి పనుల పరిశీలన

వాంకిడి : పనులను పరిశీలిస్తున్న డీఎల్పీవో ఉమర్ హుస్సేన్

వాంకిడి, ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనులను డీఎల్పీవో ఉమర్ హుస్సేన్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని జరిగే ప్రదేశంలో కూలీలకు నీడ కోసం షెడ్,తాగునీరు, మెడికల్ కిట్‌ను అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి శివ్ కుమార్ తదితరులు ఉన్నారు.

సిర్పూర్(టీ)లో ఎంపీడీవో..

సిర్పూర్(టీ), ఏప్రిల్ 22 : మండలకేంద్రంలోని షేక్‌అహ్మద్‌గౌడ, ఎస్టీ కాలనీలో కోనసాగుతున్న ఉపాధిహామీ పనులను సోమవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలకు ఎండ కాలంలో ఎదురవుతున్న పలు సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఏ రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

సిర్పూర్(యూ), ఏప్రిల్ 22 : మండల కేంద్రంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అంజయ్య తెలిపారు. మండలంలోని శెట్టిహడ్సనూర్ పంచాయతీ పరిధి చప్రి గ్రామానికి చెందిన ఆత్రం బలర్షావ్, కుర్సెంగా గణపతి రావ్, తొడసం భీంరావ్ పాముల వడా నుంచి చప్రికి బైక్‌పై 200 గ్రాములు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వారిని విచారించగా, నెట్నూర్ పంచాయతీ పరిధి ఇర్పగూడ గ్రామానికి చెందిన మడావి రాంశావ్ వద్ద నుంచి తీసుకువచ్చామని చెప్పారు. దీంతో సిర్పూర్(యూ), జైనూర్ ఎస్ఐలు సందీప్ కుమార్, మాధవ్ గౌడ్ ఇర్పుగూడ రాంశావ్ ఇంటిని తనిఖీ చేయగా, రెండు గంజాయి మొక్కలు, 500 గ్రాములు గంజాయి దొరికిందని తెలిపారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

కౌటాల, ఏప్రిల్ 22 : మండలంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలలో కాగజ్‌నగర్ ఏడీఏ మనోహర్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్, ఏఇఓ ఘన్‌శ్యాం ఉన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 22 : ఆదివాసీ నాయక్‌పోడ్ హక్కుల రక్షణకు సాయశక్తుల కృషి చేస్తామని రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గంజి రాజన్న అన్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నవనందుల రాంచందర్ ఆధ్వర్యం లోమంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ బిల్డింగ్ హాల్‌లో కమిటీ 16 వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ నాయక్ పోడ్‌లను చైతన్యపర్చి, వారి హక్కులను పొందేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారినేని రాజేశ్వరి, చందు, మహేశ్, పీ రమేశ్, ఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్
- కలెక్టరేట్ ఆవరణలో ఓటరు సెల్ఫీ బోర్డుల ప్రారంభం

సెల్ఫీ బోర్డులను ప్రారంభిస్తున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, ఏప్రిల్ 22 : లోక్‌సభ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఓటరు సెల్ఫీ బోర్డులను అదనపు కలెక్టర్ మోతీలాల్, డీఆర్డీవో కిషన్, సహాయ కార్మిక శాఖ కమిషనర్ వినీతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధమని, ఓటు ద్వారా సమర్థవంతమైన నాయకుడిని ఎన్నుకోవచ్చన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, నీడ, విద్యుత్, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ఓటరు సెల్ఫీ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, స్వీప్ సమన్వయకర్త రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఎన్నికలు సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని బదావత్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం, సీ విజిల్, వీడియో పరిశీలన, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్‌ను అదనపు కలెక్టర్, డీఆర్డీవో, సహాయకార్మిక శాఖ కమిషనర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈడీఎం సునీల్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. చెన్నూర్, మంచిర్యాల, బెల్లంపల్లి సెగ్మెంట్లలో ఎన్నికలు సజావుగా సాగేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూంతో పాటు టోల్‌ఫ్రీ నంబర్ 1950ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు, ప్రచార కార్యక్రమాల రికార్డులను పరిశీలించి, తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

24న సమావేశం..

నస్పూర్, ఏప్రిల్ 22 : ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 24న ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా ప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- జిల్లా ప్రభుత్వ దవాఖానలో తనిఖీ

దవాఖాన సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్22 : ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవల గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ సెన్నకేశవులును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, వీదుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అన్నారు. ఆసుపత్రిలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంఎచ్ వో తుకారాం భట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చారి,సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలి

వాంకిడి, ఏప్రిల్ 22 : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండలంలోని బోర్డ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలసి ఆయన సందర్శించారు. మండలంలో ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన పనుల వివరాలను ఏఈ కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో వీవీ వరలక్ష్మి, తహసీల్దార్ రోహిత్, డీఈవో పార్సీ అశోక్, ఏఈలు స్టీవన్, కిరణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ అధికారులు ఉన్నారు.

రాజురా పాఠశాల తనిఖీ..

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 22: జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను మే 31లోగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఆసిఫాబాద్ మండలం రాజురా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా విద్యుదీకరణ, తాగునీరు, మరమ్మతుల పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. వేసవి సెలవులలో మాలిక వసతుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని తెలిపారు. డీఈవో పార్సి అశోక్, సెక్టోరల్ అధికారి భరత్ కుమార్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రామకృష్ణ, డివై.ఈ.ఈ. శ్రీనివాస్, సహాయ ఇంజనీర్ గిరీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫేక్ ఫింగర్ ప్రింట్ ద్వారా అవకతవకలు

- నలుగురి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ శ్రీనివాస్

వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 22 : ఫేక్ ఫింగర్ ప్రింట్స్ ద్వారా అవకతవకలకు పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు రామగుండం కమిషనర్ ఎం శ్రీనివాస్ తెలిపారు. రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం పీఎంకేకే (ప్రధాన మంత్రి కౌశల్య కేంద్ర) ద్వారా నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఉచితంగా పలు కోర్సులు అందిస్తున్నది. ఈ మేరకు తెలంగాణలో హైదరాబాద్ పరిధి మంచిర్యాల, హుజూర్‌నగర్, జనగామలో కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ఆర్గనైజర్‌గా నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన మల్లికార్జున్ వ్యవహరిస్తున్నాడు. ఈ కేంద్రంలో అభ్యర్థుల అటెండెన్స్ ఆధారంగానే ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నది. మంచిర్యాల కేంద్రంలో 300 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోగా, నిత్యం 50 మంది మాత్రమే హారవుతున్నారు. రాబడి తక్కువగా వస్తున్నదని హెడ్ ఆఫీస్ (భూపాల్) ఆర్గనైజర్ సాహిల్ వలి, హైదరాబాద్ ఆఫీస్ ఇన్‌చార్జి ఆవునూరి శ్రీనివాస్ సూచనల మేరకు మల్లికార్జున్.. తనకు పరిచయస్తుడైన నర్సంపేటకు చెందిన విజయ్, సలీంజాఫర్, వెంకటేశ్వర్లు సహకారంతో 250 మంది ఫేక్ ఫింగర్ ప్రింట్స్ తయారు చేసి, బయోమెట్రిక్‌లో నమోదు చేశారు. అందరు అభ్యర్థులు హాజరైనట్లు రిపోర్ట్స్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి, నిధులు కాజేస్తున్నారు. ఈ స్కామ్ గురించి సమాచారం అందడంతో టాస్క్ ఫోర్స్‌ను రంగంలోకి దింపి, మంచిర్యాలలోని సెంటర్‌లో తనిఖీ చేశారు. ఇన్‌చార్జి దేవేందర్‌ను విచారించగా, ఈ స్కామ్ గురించి తెలిసింది. సీపీ, డీసీపీల ఆదేశాల మేరకు పోలీసులు దేవేందర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆస్‌లోని ఫేక్ ఫింగర్ ప్రింట్స్, ఆఫీస్ రికార్డులను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశారు. విచారణ ప్రారంభించిన పోలీసులు మల్లికార్జున్, నర్సంపేటకు చెందిన వెంకటేశ్వర్లు, సలీంజాఫర్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఫేక్ ఫింగర్ ప్రింట్స్, తయారీ సామగ్రి, అభ్యర్థుల అటెండన్స్ రిజిస్టర్, డాక్యుమెంట్, ల్యాప్‌టాప్, బయోమెట్రిక్ మిషన్లను రికవరి చేసుకున్నారు. ఇందులో ప్రధాన సూత్రదారులైన భూపాల్‌కు చెందిన సాహిల్‌వలి, హైదరాబాద్‌కు చెందిన ఆవునూరి శ్రీనివాస్‌ను తదుపరి విచారణ అనంతరం అరెస్ట్ చేయనున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ బన్సీలాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో ప్లాస్టిక్ వేస్తే అనర్థాలు

ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించిన మేనేజర్ సురేశ్, సిబ్బంది

కోటపల్లి, ఏప్రిల్ 22 : అడవిలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయడం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కోటపల్లి మండలం సర్వాయిపేట సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్, పరిసర అటవీ ప్రాంతంలో పేరుకపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను వాచర్స్ సాయంతో తొలగించి, అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడుతూ భూమిని పరిరక్షించుకోవడం మీద మానవాళితో పాటు సమస్త జీవరాశుల మనుగడ ఆధారపడి ఉందని ఆయన పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇష్టారీతిన పడేస్తే పర్యావరణ కాలుష్యంతో పాటు అడవిలో సంచరించే జీవరాశులు వాటిని తిని మృత్యువాత పడుతున్నాయన్నారు. అడవుల్లో ప్లాస్టిక్‌ను వాడడం నేరమని, సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. భూమిపై కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ చెట్లు పెంచాలని పిలుపునిచ్చారు. అడవులు, ప్లాంటేషన్లలో ముఖ్యంగా వేసవిలో అగ్ని ప్రమాదాల బారిన పడకుండా కాపాడే భాద్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్ వైజర్ శ్రీనివాస్, వాచర్లు సాయి కిరణ్, లచ్చన్న, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలి

తాండూర్, ఏప్రిల్ 22 : రేషన్ బియ్యం అక్రమ దందా చేస్తున్న స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫుడ్ కార్పొరేషన్ మెంబర్ పులుగం తిరుపతి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఆకలితో అలమటించరాదని భారత ప్రభుత్వం ఎంతో ముందుచూపుతో ఉచిత రేషన్ బియ్యం ఇస్తున్నదన్నారు. కొంతమంది పందికొక్కులు స్మగ్లర్లుగా మారి వారి నోటి ముందున్న అన్నాన్ని లాగేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో చాలా చోట్ల నుంచి అక్రమ రవాణా ద్వారా రేషన్ బియ్యం మహారాష్ట్రకు తరలిపోతుంటే సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ప్రతిరోజు రైల్లు, లారీలు, ఆటోల్లో అక్రమంగా బియ్యం రవాణా జరుగుతూనే ఉన్నదన్నారు. అయినా అధికారులు విఫలమవుతున్నారని మండిపడ్డారు.

యోగేశ్వర్ సేవలు అభినందనీయం

కాగితపు కవర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

కోటపల్లి, ఏప్రిల్ 22 : పర్యావరణ ప్రేమికుడు గుండేటి యోగేశ్వర్ సేవలు అభినందనీయమని మంచిర్యాల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. కోటపల్లి మండలం పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం గుండేటి యోగేశ్వర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు బోధిస్తూనే తనవంతుగా మొక్కలను పెంచడం, జీవ వైవిధ్యాన్ని కాపాడడం వంటి కార్యక్రమాలను చేస్తుండే వాడని పేర్కొన్నారు. పర్యావరణ హితుడిగా పేరున్న యోగేశ్వర్, ఇక నుంచి తన కార్యక్రమాలను జిల్లా మొత్తం విస్తరించాలని కోరారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కాగితపు కవర్లను అదనపు కలెక్టర్ రాహుల్ ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఎంఈవో తిరుపతి రెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి కొట్టె శంకర్, మాజీ ఎంఈవోలు బెజ్జంకి జగన్, రాజేశం గౌడ్, మాజీ సర్పంచ్ నామని లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

అల్ఫోర్స్‌లో గ్రాడ్యుయేషన్ డే

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 22 : మంచిర్యాల పట్టణంలోని అల్ఫోర్స్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో యుకేజీ విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఆ విద్యాసంస్థల అధినేత వీ నరేందర్‌రెడ్డి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రాథమిక విద్య చాలా కీలకమన్నారు. వారికి పోటీతత్వం పెరిగేలా విద్యనందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లిరూరల్, ఏప్రిల్ 22 : బెల్లంపల్లి పట్టణంలో ఓ వ్యాపారిని కొట్టి, అతని నుంచి రూ.10,200 ఎత్తుకెళ్లిన ముగ్గురిని సోమవారం టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో ఏసీపీ రవికుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా రేకుర్తి గ్రామానికి చెందిన ఆంజనేయులు చింతగింజల వ్యాపారం కోసం వారం క్రితం తన ఆటోలో బెల్లంపల్లి వచ్చాడు. చింతగింజలు కొనుగోలు చేసి, రాత్రి చౌడేశ్వరి వైన్‌షాప్‌లో మద్యం తాగి, రైల్వేస్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద పడుకున్నాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో బెల్లంపల్లికి చెందిన సిరిగి మహంకాళి, లెక్కల శివప్రసాద్, మోట సింహాచలం అతడిని కొటి, రూ.10,200 ఎత్తుకెళ్లారు. బాధితుడు బెలంపల్లి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. రూరల్ సీఐ అష్టలొద్దీన్, టూ టౌన్ ఎస్ఐ డీ రమేశ్ సీసీ పుటేజ్ పరిశీలించి, ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారు నేరాన్ని అంగీకరించడంతో వారి నుంచి రూ.3 వేలతో పాటు బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వెల్లడించారు.

గాలివాన బీభత్సం

కెరమెరి : నేలకొరిగిన మక్కను పరిశీలిస్తున్న రైతు

కౌటాల/కెరమెరి/జైనూర్, ఏప్రిల్ 22 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కౌటాల మండలం ముత్తంపేట, మొగడ్ధగడ్, బాలెపల్లి, తాటిపల్లి, పార్డీ, తలోడి, నదీమాబాద్ గ్రామాల్లో చెట్లు విరిగి పడ్డాయి. రేకుల షెడ్లు, పశువుల పాకలు, దుకాణాల బోర్డులు గాలికి లేచి పోయాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కెరమెరిలో గాలివానకు మక్క, జొన్న పంటలు నేలకొరిగాయి. కొన్ని గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. జైనూర్ మండలంలో సోమవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది.

వేంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పరిశీలన

సిర్పూర్(టీ), ఏప్రిల్ 22 : సిర్పూర్(టీ)–కాగజ్‌నగర్ ప్రధాన రహదారి వేంపల్లి సమీపంలోని బీటీ రోడ్డు, వేంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను సోమవారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, తదితరులు ఉన్నారు.

కాలువలో పడి ఒకరి మృతి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 22 : మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన తగరపు భిక్షపతి (38) ఐబీ చౌరస్తాలోని ఎల్‌ఐసీ కాలనీ ఎంట్రెన్స్‌లో గల నీళ్ల లేని కాలువలో పడి మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భిక్షపతి ఆదివారం సాయంత్రం కాలువ గోడపై కూర్చొని ఉండగా, ప్రమాదవశాత్తు అందులో పడ్డాడు. తనతో ఉన్న ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మరోవ్యక్తి భిక్షపత్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే ప్రభుత్వ దవాఖాకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తేల్చారు. భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి కూలీల నిరసన

జైనూర్,ఏప్రిల్ 22 : జైనూర్ పోస్టల్ శాఖ బీపీఎంలు కూలీ డబ్బుల చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తున్నారని ఉపాధి హామీ కూలీలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. విలేకరులతో మాట్లాడుతూ కూలీ డబ్బులు తీసుకోవడానికి తపాలా కార్యాలయానికి వస్తే బీపీఎంలు కూలీ డబ్బుల చెల్లింపులో ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఖాతాలో డబ్బు ఉన్నా లేవని వాపసు పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉండాలి

రెబ్బెన, ఏప్రిల్ 22 : లేతన్‌గూడ (ఇందిరనగర్) ప్రభుత్వ పాఠశాలలో సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఎం దొడ్డిపట్ల రవికుమార్ పేర్కొన్నారు. 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వీడ్కోలు చేబుతూ వారితో ఉన్న అనుబంధం గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సాయికృష్ణ లతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 22: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 24న వాహనాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ శామ్యూల్ జాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఎక్సైజ్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సమస్యలపై పోరాటం చేయాలి

రెబ్బెన, ఏప్రిల్ 22 : సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని ఏఐటీయుసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్‌లు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిటౌన్‌షిప్ లో గల ఆఫీసర్స్ క్లబ్‌లో సోమవారం ఏఐటీయుసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అధ్యక్షతన ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతుల్లో భాగంగా నిర్వహించిన శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సింగరేణి లో గుర్తింపు కార్మిక సంఘంగా కార్మికుల పక్షనా నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యుసుఫ్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నర్సింహారావు, రిటైర్డ్ డీజీఎం(పర్సనల్) శ్యాంసుందర్, గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, చంద్రశేఖర్, జూపాక రాజేశ్, శివరావు, ఆనంద్, రాజయ్య, కిరిణ్‌బాబు, ఫిట్ కార్యదర్శులు ఎంబటి రామయ్య, అశోక్, రమేశ్, యుగంధర్, నాయకులు సురేశ్‌కోరి, సమీ, శ్రీనివాస్, రాజయ్య, అంజయ్య, కోటి లతో పాటు పలువురు ఉన్నారు.

నీళ్ల ట్యాంక్‌కు మెట్ల ఏర్పాటు

- 'నమస్తే'కు స్పందన

ఏర్పాటు చేస్తున్న మెట్లు

భీమారం, ఏప్రిల్ 22 : భీమారం మండల కేంద్రంలోని ఇప్పల బోడ మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న నీళ్ల ట్యాంక్‌కు మెట్లు ఏర్పాటు చేయండి అని 'నమస్తే'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో రాధా రాథోడ్ ఆదేశాల మేరకు సోమవారం మెట్లు ఏర్పాటు చేశారు. ట్యాంక్‌ను శుభ్రం చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

దండేపల్లి, ఏప్రిల్ 22 : ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. దండేపల్లి మండలం మాకుల పేటలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చే